గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

కందుకూరు, ఏప్రిల్ 13 : కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజా ఆశీర్వాద యాత్ర మండల పరిధిలోని చిప్పలపల్లి, దన్నారం, పులిమామిడి, బాచుపల్లి, నేదునూరు, ముచ్చర్ల, ఊట్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన అనంతరం గుమ్మడవెల్లి గ్రామంలో గ్రామంలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో బూర నర్సయ్యగౌడ్‌తో కలిసి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి కంటి తుడుపు చర్యగా.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి 5 గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైనట్లు చెప్పారు. అవి గ్యారంటీలు కావని.. పచ్చి మోసాలని విమర్శించారు. రాష్ట్రంలో సమస్యలు విలయం తాండవం చేస్తుంటే సీఎం సమస్యలను గాలికి వదిలి తిరుగుతున్నాడని చెప్పారు. తాగునీరు, కరెంట్, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని వివరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు, కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి పాండు, సాధ మల్లారెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బొక్క సత్యనారాయణరెడ్డి, మల్లేశ్, ఎల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆనేగౌని అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

సభా ప్రాంగణంలో నినాదాలు చేస్తున్న బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నేతలు

మీర్‌పేట నుంచి చేవెళ్ల సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు

గులాబీ జెండా ఎగరేస్తాం

చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివెళ్లిన గులాబీ శ్రేణులు

బడంగ్‌పేట, ఏప్రిల్ 13: చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, రైతులు, బీఆర్ఎస్ అభిమానులు, మహిళలు భారీగా సభకు తరలివెళ్లారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 40 బస్సులు, 25 కార్లు, తుక్కుగూడ నుంచి 10 బస్సులు, 10 పది కార్లు, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 30 బస్సులు, 20 కార్లు, కందుకూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి 35 బస్సులు, మహేశ్వరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి 30 బస్సులు, 15 కార్లు, జల్‌పల్లి మున్సిపాలిటీ నుంచి 10 బస్సులు, 10 కార్లలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. సభా ప్రాంగణానికి చేరుకున్న తర్వాత గులాబీ జెండాలతో జై తెలంగాణ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యం అవుతుందని నినాదాలు చేశారు. కేసీఆర్ ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని, కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు బలంగా నమ్ముతున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ ఎంపీగా ముచ్చటగా మూడోసారి గెలిపించుకుంటామని నేతలు శపతం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసిన నేతలకు చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని నేతలు శపథం చేశారు. నమ్మక ద్రోహులకు రాజకీయ సమాధి తప్పదని నేతలు జోష్యం చెప్పారు. తరలివెళ్లిన వారిలో మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బడంగ్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు కామేశ్ రెడ్డి, తుక్కుగూడ అధ్యక్షుడు లక్ష్మయ్య, మహేశ్వరం అధ్యక్షుడు రాజు నాయక్, కార్పొరేటర్లు, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండలాల నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

జల్‌పల్లి నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు



కందుకూరు నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు

హయత్‌నగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పరిమళ సాహితి ప్రతినిధులు

14న సాహిత్య సమాలోచన సదస్సు

హయత్‌నగర్, ఏప్రిల్ 13: ఈనెల 14న ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి సాహిత్య సమాలోచన సదస్సును నల్లగొండ ఎన్‌జీ కళాశాలలో సృజన సాహితీ ఆధ్వర్యంలో జరగనుందని పరిమళ సాహితీ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ మండల స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో పరిమళ సాహితి ప్రతినిధులు సమావేశమై సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల స్వామి మాట్లాడుతూ.. ఏనుగు నరసింహారెడ్డి కవిత్వం, కథ, నవల, శతకం, పద్యం, విమర్శ, అనువాదం, రుబాయి వంటి విభిన్న ప్రక్రియలలో మూడు దశాబ్దాలుగా కృషి చేస్తున్నారని, అందుకు నిదర్శనంగా సదస్సు నిలుస్తుందన్నారు. క్రోధినామ సంవత్సర తెలుగు ఉగాది సందర్భంగా కవిత పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిమళ సాహితి ప్రధాన కార్యదర్శి నకిరేకంటి శ్రీనయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏబూషి నర్సింహ, రాచకొండ జానయ్య, బాసరాజు యాదగిరి, కంచి రవికుమార్, చెట్టి గణేశ్ గౌడ్, తలారి రవి, డాక్టర్ పున్న దామోదర్, కొలనుపాక చంద్రశేఖర్, వంగపల్లి గణేశ్, గడ్డం శ్రీనయ్య, సిద్దగోని పరమేశ్, దంతూరి సైదులు గౌడ్, కొండ కాటమయ్య, వంగపల్లి స్వామి, రాచకొండ సునీల్, బి.శ్రీనివాస్, కాసుల ఆంజనేయులు, కోరెంక యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లుల సంఘం కమిటీలు, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశం

మాదన్నపేట, ఏప్రిల్ 13: సైదాబాద్ మండల పరిధిలోని పాఠశాల యాజమాన్యం కమిటీలు, తల్లుల కమిటీ సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో భరతనగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. విద్యాశాఖ ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటును విరమించి విద్యాశాఖ జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని పాఠశాల యాజమాన్య కమిటీలను పటిష్ట పరిచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కట్ట సుదర్శన్, సత్యవతి, లావణ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

ఆర్కేపురం, ఏప్రిల్ 13: ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ తెలిపారు. శనివారం సరూర్‌నగర్ డివిజన్ క్రాంతినగర్‌లో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ అభివృద్ధి జరగాలంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని, అందుకోసం కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు.

తిరుపతి శ్రీవారి దర్శనం టికెట్లు ఇప్పిస్తామంటూ మోసం

మన్సూరాబాద్, ఏప్రిల్ 13: తిరుపతి శ్రీవారి దర్శనం కోసం వీఐపీ టికెట్లను ఇప్పిస్తామని చెప్పి డబ్బులు కాజేసిన వ్యక్తిపై ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. టీటీడీ చైర్మన్ పీఏ నంటూ చరణ్ అనే వ్యక్తి ఎల్బీనగర్‌కు చెందిన కపిల్‌కుమార్‌రెడ్డికి ఆన్‌లైన్‌లో పరిచయం అయ్యాడు. తిరుపతిలో పలు సేవా టికెట్లతో పాటు శ్రీవారి దర్శనం కోసం వీఐపీ టికెట్లు ఇచ్చేందుకు ఈనెల 7న రూ. 1.60 లక్షలు ఆన్‌లైన్ ద్వారా చరణ్‌కు కపిల్‌కుమార్‌రెడ్డి ట్రాన్స్‌ఫర్ చేశాడు. నాటి నుంచి టికెట్స్ కోసం కపిల్‌కుమార్‌రెడ్డి పలుమార్లు చరణ్‌కు ఫోన్ చేస్తుండగా.. ఫోన్ ఎత్తడం లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన కపిల్‌కుమార్‌రెడ్డి ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న రామ్మోహన్‌గౌడ్, లక్ష్మీప్రసన్న దంపతులు

కాంగ్రెస్ పార్టీలో చేరిన రామ్మోహన్‌గౌడ్

వనస్థలిపురం, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొదట బీఆర్ఎస్ పార్టీలో ఉన్న రామ్మోహన్‌గౌడ్ దంపతులు గతేడు అక్టోబర్‌లో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం నవంబర్ నెలలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరి, బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి గెలుపునకు కృషి చేశారు. తిరిగి శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు పలువురు అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

గడపగడపకూ ప్రచారం..

కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలని ఓటర్‌కు విజ్ఞప్తి చేస్తున్న గడ్డం నీతారంజిత్‌రెడ్డి

ఆర్కేపురం, ఏప్రిల్ 13: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆర్కేపురం డివిజన్‌లో గడపగడపకూ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలని గడ్డం నీతారంజిత్‌రెడ్డి, పీసీసీ మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువ జన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పున్న గణేశ్, బండి మధు, మహేందర్, రమేశ్, యాదయ్య, లింగస్వామిగౌడ్, ఎల్లయ్య, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, శైలజారెడ్డి, సుజాతారెడ్డి తదితరులు ఉన్నారు.

పార్టీని నిలబెట్టిన క్యాడర్‌ను కాపాడుకుంటాం

వనస్థలిపురం, ఏప్రిల్ 13: కష్టకాలంలో అండగా ఉండి పార్టీని నిలబెట్టిన ప్రతి కార్యకర్తలను కాపాడుకుంటామని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా చేరినవారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలు కొండంత బలం అన్నారు. ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాశ్‌గౌడ్, ఎస్వీ కృష్ణప్రసాద్, కలకాని వెంకట్, లింగాల నాగేశ్వరరావు, మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహ యాదవ్, సురేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలి

సైదాబాద్, ఏప్రిల్ 13 : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోల్ భాస్కర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. శనివారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని కల్యాణ్‌నగర్ కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇరవై లక్షల మంది కుటుంబాలకు చెందిన దివ్యాంగులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించటానికి ప్రభుత్వం కృషి చేయడంలేదన్నారు. 2016లో కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన దివ్యాంగుల హక్కుల రక్షణ (ఆర్‌పీడీ)యాక్టులో స్థానిక సంస్థల్లో, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల్లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఆ దిశగా ఎటువంటి ప్రయత్నాలు చేయటం లేదన్నారు. దీంతో దివ్యాంగులపై దౌర్జన్యాలు, దాడులకు పాల్పడటం, వారి ఆస్తులను ఆక్రమించుకోవటం, వేధింపులకు గురిచేటయం వంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నాయన్నారు. దివ్యాంగుల సంబంధిత కేసుల విచారణ కోసం సెక్షన్-83,84 చట్టం ప్రట్టం ప్రకారం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను నియమించాలని అదేశించటం జరిగిందన్నారు. రాష్ట్రంలో వికలాంగుల హక్కుల కపాడుట కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో చాలమంది అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల దివ్యాంగుల కుటుంబాలు అనేక రకాల సమస్యలతో వాటిని పరిష్కరించటానిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఛత్తీస్ ఘగ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో వికలాంగుల హక్కుల రక్షణ చట్టాన్ని అమలు చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయటం జరుగుతుందని, అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశామని తెలిపారు. వికలాంగుల సంఘాల నెట్ వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కులను, రక్షణ కల్పించటానికి ఏర్పాటుచేసిన ఆర్‌పీడీ చట్టాన్ని అమలు చేసి, లక్షలాది మందికి ప్రభుత్వం అండగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోల్ భాస్కర్ తదితరులు

ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 13: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాణి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏక్తా జనశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేశ్ యాదవ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల కోసం ఎనలేని కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐలేశ్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాజేశ్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు

మదర్ థెరిస్సా ఆశ్రమ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

మన్సూరాబాద్, ఏప్రిల్ 13: మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మదర్ థెరిస్సా ఆశ్రమ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ప్రజలు సంచరించే ప్రధాన చౌరస్తాలతో పాటు బస్‌స్టాప్‌లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా ఆలోచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా ఆశ్రమ ఫౌండేషన్ అధ్యక్షుడు సి.దత్తయ్య, ప్రధానకార్యదర్శి అనపూసల రామస్వామి, సభ్యులు మధు, దుర్గాప్రసాద్, మహేందర్‌గౌడ్, ఎస్.వెంకటేశ్, రోహిత్, కేశవులు పాల్గొన్నారు.

మార్గం రాజేశ్‌కు జాతీయ సేవా రత్న అవార్డు

ఆర్కేపురం, ఏప్రిల్ 13: ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్‌కు జాతీయ సేవా రత్న అవార్డు ప్రదానం చేశారు. ఈ సేవా రత్నను యువ ఆర్ట్ సాంస్కృతిక కార్యక్రమాల సభలో ఆంధ్ర ప్రదేశ్ మాజీ మంత్రి కే.పుష్పలీల అందజేశారు. మార్గం రాజేశ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఆయనకు సేవా రత్న అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని యువ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డా.బి.ఆర్.వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి డా.వేణుగోపాలచారి, మందడి కృష్ణారెడ్డి, చిల్లా రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాజేశ్‌కు జాతీయ సేవా రత్న అవార్డును అందజేస్తున్న పుష్పలీల, వేణుగోపాలచారి

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి.. యువకుడు అరెస్ట్

సైదాబాద్, ఏప్రిల్ 13: విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌పై దాడిచేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన సైదాబద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంతోష్‌నగర్‌కు చెందిన కృష్ణదొర మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా, మాదవనగర్ కాలనీ రహదారిపై తండ్రి కొడుకుల మధ్య గొడవ పడుతున్నట్లు సమాచారం అందటంతో అక్కడి వెళ్లాడు. మాదవనగర్ కాలనీకి చెందిన జి.కోటప్ప అతడి కుమారుడు వరుణ్ గొడవ పడుతున్నారు. దీంతో హెడ్ కానిస్టేబుల్ కృష్ణదొర తండ్రి కొడుకులను వారించే ప్రయత్నం చేయగా, వరుణ్ హెడ్ కానిస్టేబుల్‌ను దుర్భాలాడుతూ దాడికి పాల్పడటంతో గాయాలయ్యాయి. దీంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో నిందితుడు వరుణ్ తప్పించుకొని తిరుగుతుండగా శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ లక్ష్మయ్య కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

280 బస్తాల బయ్యాన్ని సీజ్ చేసిన పోలీసులు

వనస్థలిపురం, ఏప్రిల్ 13: పేదలకు చేరాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి గోదాంలో నిల్వ ఉంచారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు గోదాంపై దాడి చేసి సీజ్ చేశారు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. వనస్థలిపురం డబుల్ బెడ్‌రూం సముదాయంలో నివాసముండే నెహ్రూ అనే వ్యక్తి గత కొంతకాలంగా అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నాడు. పలు చోట్ల సేకరించిన బయ్యాన్ని ఇంజాపూర్ సమీపంలోని ఓ గోదాంలో నిల్వ ఉంచుతున్నాడు. విశ్వసనీయ సమాచారం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం రాత్రి గోదాంపై ఆకస్మికంగా దాడి చేశారు. అక్క ఉన్న 280 బస్తాల బియ్యాన్ని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం పక్కదారి పడుతున్నా సివిల్ సప్లై అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వందల క్వింటాళ్లు అక్రమ మార్గాన వెళ్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న అపవాదులు ఉన్నాయి.

యువకుడు అదృశ్యం

నర్సింలు (ఫైల్)

పహాడీషరీఫ్, ఏప్రిల్ 13: యువకుడు అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ సలీం ఆస్పత్రి సమీపంలో నివసిస్తున్న నర్సింలు (35) భార్య కొమ్మగల రాణి.. ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యాపారంలో ఆర్థికంగా నష్టం రావడంతో మనస్తాపం చెందిన నర్సింలు గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చంపాపేట, ఏప్రిల్13: తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు దంపతులను సనానిస్తున్న కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాస శర్మ, ధర్మకర్తలు బబ్బురి ఆనంద్‌కుమార్ గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, చేగోని సురేశ్‌గౌడ్, మధుసాగర్, బీర తిరుమలేశ్, వేదపండితులు, అర్చకులు.